# కేసీఆర్ పాలనలోనే పచ్చబడ్డ పాలమూరు

- రేవంత్‌తో జిల్లాకు ఒరిగేదేమీలేదు
- నాటి పనులకే నేడు శిలాఫలకాలు
- పండిన పంటలు, రైతులే సాక్ష్యం
- 'పాలమూరు'పై కాంగ్రెస్ నిర్లక్ష్యం
- పనులు నిలిపి పాలకుల చోద్యం
- రేవంత్‌కు చేతగాక అభాండాలు
- తెలంగాణను తెచ్చిన మహానేత కేసీఆర్‌ను తక్కువ చూపే యత్నం
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఫైర్



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): 'సమైక్య పాలనలో వలసలతో అరిగోసపడ్డ ఉమ్మడి పాలమూరు జిల్లా.. కేసీఆర్ హయాంలోనే పచ్చబడ్డది.. ఇందుకు దండిగా పండిన పంటలు, ఆ పంటలు పండించిన రైతులే సాక్ష్యం' అని బీఆర్‌ఎస్ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఉద్ఘాటించారు. అలుపెరగని పోరాటంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే, నాడు ఉద్యమంలో ఏ పాత్రాలేని సీఎం రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని నిప్పులు చెరిగారు. అధికారిక కార్యక్రమాల్లోనూ తూలనాడుతూ ఆ మహానేతను చిన్నగా చూపే యత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 'స్వాతంత్రోద్యమంలో గాంధీ, నెహ్రూ పాత్రను ఎవరూ చెరిపేయలేరు.. రాష్ట్రాన్ని సాధించి చరిత్ర సృష్టించిన కేసీఆర్ ఆనవాళ్లనూ ఎవరూ తుడిచేయలేరు' అని స్పష్టంచేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్‌యాదవ్‌తో కలిసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వనపర్తి పర్యటనతో ప్రజలకు ఒరిగిందేమీలేదని తేల్చిచెప్పారు. కేసీఆర్ మొదలుపెట్టిన పనులకు నేడు శిలాఫకాలు వేయడమే తప్పా కొత్తగా చేపట్టిన పనులేమీలేవని విమర్శించారు. వెయ్యి కోట్ల నిధులంటూ డబ్బా కొట్టుకోవడమేనని, వచ్చిందేమీలేదని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో 90 శాతం పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేయడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నదని ప్రశ్నించారు. కేవలం మరో రూ.1,200 కోట్లు వెచ్చిస్తే పూర్తయ్యే పథకాన్ని నిలిపివేసిన పాలకులు చోద్యం చూస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రికి సొంత జిల్లా అభివృద్ధిపై నిజంగా నిబద్ధత, ఇక్కడి రైతులపై ప్రేమ ఉంటే వెంటనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

### ప్రభుత్వ సభకు.. పార్టీ సభకు తేడా తెలియదా?

అబద్ధాలు చెప్పడం, ప్రజలను మోసం చేయడం రేవంత్‌రెడ్డికి రివాజుగా మారిందని నిరంజన్‌రెడ్డి విరుచుకుపడ్డారు. మొన్న వనపర్తిలో అధికారిక కార్యక్రమంలోనూ కేసీఆర్‌పై నిందలు వేయడం, పచ్చి అబద్ధాలు చెప్పడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ సభకు పార్టీ సభకు తేడా తెలియని వారు పాలకులు కావడం మన దౌర్భాగ్యమని ఎద్దేవా చేశారు. అధికారం చేపట్టి 15 నెలలైనా రేవంత్ పాలనపై పట్టు సాధించనేలేదని చెప్పారు. ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే ఊరుకోబోమని, వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు.

### జూపల్లి ఝుటా మాటలు

బీఆర్‌ఎస్ పాలనలో మంత్రితోపాటు అనేక పదవులు అనుభవించిన జూపల్లి కృష్ణారావు ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి ఝుటా మాటలు మాట్లాడుతున్నారని నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు కేసీఆర్ తోనే పాలమూరుకు మేలు జరుగుతుందని, ఆహో.. ఓహో అంటూ పొడిగిన నోటితోనే నేడు తెగనాడటం ఆయన ద్వంద్వనీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌లో మంత్రి పదవిరాగానే అప్పుడు ఏ ఒక్క పనికా లేదని పచ్చి అబద్ధాలు చెప్పడం జూపల్లికే చెల్లిందని తూర్పారబట్టారు.

### రేవంత్.. చిన్నారెడ్డికి సమాధానం చెప్పు

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఇటీవల చేసిన ఆరోపణలపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల ప్రెస్‌మీట్‌లో తనకు ఏఐసీసీ ఇచ్చిన ఎమ్మెల్యే టికెట్‌ను తమ పార్టీ వాళ్లు అమ్ముకున్నారని చెప్పారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో 90 కోట్లు ఖర్చుచేశారని బాహాటంగానే వెల్లడించారని గుర్తుచేశారు. చిన్నారెడ్డి చేసిన ఆ ఆరోపణలకు రేవంత్‌రెడ్డి ఏం సమాధానం చెప్తారు? ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అని సూటిగా ప్రశ్నించారు.

### 500 సిలిండర్ వస్తలేదని చేతులెత్తి చెప్పలేదా?

'వనపర్తి సభలో రూ.500 సిలిండర్ వస్తుందా? అని అడిగిన ముఖ్యమంత్రికి మహిళలు లేదు..లేదు.. అంటూ చేతులెత్తి చెప్పిన విషయం వాస్తవం కాదా? మీ పాలనా వైఫల్యానికి ఇదే నిదర్శనం కాదా? అని సీఎం రేవంత్‌రెడ్డిని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో మహిళలే కాదు ఏ ఒక్కరూ సంతోషంగా లేరని చెప్పారు. అన్నివర్గాలు మోసపోయామని భావిస్తున్నాయని తెలిపారు. రైతులకు రుణమాఫీ చేయలేదని, రైతుభరోసా ఎగ్గొట్టారని విమర్శించారు. మోసపూరిత ప్రభుత్వానికి బుద్ధిచెప్పేందుకు ప్రజలు తగిన సమయం కోసం ఎదురు చూస్తున్నారని హెచ్చరించారు.


### నిరంతరం పాలమూరు అభివృద్ధికే పాటుబడ్డ

'తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో కలిసి 14 ఏండ్లు పనిచేసిన. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేండ్లు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా, ఐదేండ్లు వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేసిన. నిరంతరం పార్టీలకతీతంగా పాలమూరు అభివృద్ధికే పాటుపడ్డ.. అని నిరంజన్‌రెడ్డి చెప్పారు. కానీ తాను రాజకీయాలను కలుషితం చేశానని సీఎం రేవంత్ తనపై అభాండాలు వేయడం సరికాదని హితవు పలికారు. కేసీఆర్‌ను ఒప్పించి గట్టు రిజర్వాయర్‌ను సాధించి, రూ.50 కోట్లు మంజూరు చేయించి శంకుస్థాపన చేయించినం.. కానీ ఈ సీఎం ఆ రిజర్వాయర్ పనులకు మళ్లీ శిలాఫలకం వేయడం ఆశ్చర్యంగా ఉన్నదని పేర్కొన్నారు. నిజంగా ఆయనకు చిత్తశుద్ధి ఉంటే కొత్త పనులు మంజూరు చేసి విరివిగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## బీఆర్‌ఎస్ పనులు.. రేవంత్ గప్పాలు

'కేసీఆర్ పాలనలోనే వనపర్తి జిల్లాగా రూపుదిద్దుకున్నది. రూ.550 కోట్లతో చేపట్టిన మెడికల్, నర్సింగ్ కాలేజీలు, ప్రభుత్వ దవాఖాన పనులు పురోగతిలో ఉన్నాయి. మూడేండ్ల క్రితమే జేఎన్టీయూ కాలేజీ మొదటి విడత పనులు పూర్తయ్యాయి. రెండోదశ పనులు కొనసాగుతున్నాయి. ఇవన్నీ ప్రజలకు కండ్ల ముందరే కనిపిస్తున్నాయి' అని నిరంజన్‌రెడ్డి వివరించారు. వనపర్తికి వచ్చిన సీఎం రేవంత్ ఆ పనులకే మళ్లీ శంకుస్థాపనలు చేయడం విడ్డూరమని పేర్కొన్నారు. కేటీఆర్ రూ.21 కోట్లతో నాడు శ్రీకారంచుట్టిన ఐటీ టవర్ శిలాఫలకాన్ని ధ్వంసంచేసి తిరిగి ప్రారంభించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రేవంత్ సీఎంలా కాకుండా రాజకీయ పార్టీలో రెబల్ కార్యకర్తలా వ్యహరిస్తున్నారని విమర్శించారు.

## • బీఆర్‌ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకులు



మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం దేపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మారెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
- నవాబ్‌పేట

# కేటీఆర్ సూచనతో కదిలిన యంత్రాంగం

**జక్కాపూర్‌లో రంగనాయకసాగర్ కాలువను పరిశీలించిన ఎస్ఈ, అధికారులు**



సిద్దిపేట జిల్లా జక్కాపూర్‌లోని రంగనాయకసాగర్ నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల వరకు ఉన్న కాలువను పరిశీలిస్తున్న ఎస్ఈ రవీందర్, చిత్రంలో అధికారులు, రైతులు

సిరిసిల్ల రూరల్, మార్చి 3 : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సూచనతో రంగనాయకసాగర్ అధికారులు కదిలారు. ఈ నెల 2న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పర్యటించిన ఆయనను రంగనాయకసాగర్ నుంచి నీళ్లు ఇప్పియ్యాలని తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల, నేరెల్ల, చిన్నలింగాపూర్, రామచంద్రాపురం, దాచారం రైతులు కోరిన విషయం తెలిసిందే. స్పందించిన కేటీఆర్ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడి నీళ్లు అందివ్వాలని సూచించారు. సోమవారం సిద్దిపేట జిల్లా జక్కాపూర్‌లోని రంగనాయకసాగర్ కాల్వను ఎస్ఈ రవీందర్, అధికారులు తంగళ్లపల్లి మండల రైతులతో కలిసి సందర్శించారు. రంగనాయక సాగర్ కాల్వ నుంచి జిల్లెల్ల వరకు నీటి సరఫరా చేస్తామని, కాలువలో భూములు కోల్పోయిన రైతులకు పెండింగ్‌లో ఉన్న పరిహారం రూ.55 లక్షలు త్వరలోనే అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్థిక నేరాలకు పాల్పడిన డాక్టర్ అరెస్ట్

**టిప్పు సుల్తాన్ ట్రస్టు పేరిట రూ.5,56,75,000 వసూలు**



ఏఆర్ సుల్తాన్ రాజా

జనగామ చౌరస్తా, మార్చి 3 : టిప్పుసుల్తాన్ వారసుడినంటూ, ఆ ట్రస్టుకు చైర్మన్ తనే అని ప్రచారం చేసుకుంటూ ఏడుగురు బాధితుల నుంచి రూ.5 కోట్ల 56 లక్షల 75 వేలు తీసుకొని మోసం చేసిన డాక్టర్‌ను జనగామ అర్బన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. తమిళనాడులోని తేని ప్రాంతం కుంభంకు చెందిన అబ్దుల్ రహీమ్ సుల్తాన్ రాజా 2010లో రష్యాలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. 2020లో జనగామలో తన భార్య కరీమా కతిన్ (కేకే) పేరిట హాస్పిటల్ ప్రారంభించాడు. తన వద్దకు వైద్యం కోసం వచ్చే వారితో తాను టిప్పుసుల్తాన్ ట్రస్టుకు చైర్మన్ అని, కర్ణాటక ప్రభుత్వం నుంచి ట్రస్ట్‌కు రూ.700 కోట్లు వస్తున్నాయని చెప్పేవారు. ఈ క్రమంలో జనగామకు చెందిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఎండీ వసీంకు రూ.700 కోట్లతో జనగామలో మెడికల్ కాలేజీ కడతానని, దానికి సంబంధించి కాంట్రాక్ట్ వర్క్ ఇప్పిస్తానని చెప్పి అతడి నుంచి రూ.1.17 కోట్లు తీసుకున్నాడు. 2021లో హైదరాబాద్ ఈఎస్ఐలో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆనంద్ నుంచి రూ.3.75 లక్షలు, రాజ్‌కుమార్ నుంచి రూ.5. 50 లక్షలు, సిద్ధార్థ నుంచి రూ.5. 50 లక్షలు తీసుకున్నాడు. 2023లో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పాండు నుంచి రూ.5 లక్షలు, హైదరాబాద్‌కు చెందిన ఆచార్య ఆడిటర్ ఎస్‌వీఎన్ నుంచి రూ.1.70 కోట్లు, కరీంనగర్‌కు చెందిన సీహెచ్ అనిల్‌రెడ్డి నుంచి రూ.2 కోట్లు తీసుకున్నాడు. మొత్తం ఏడుగురు నుంచి రూ.5 కోట్ల 56 లక్షల 75 వేలు తీసుకుని దవాఖాన మూసివేశాడు. దీంతో డాక్టర్‌పై బాధితులు ఫిర్యాదు చేయగా పోలీసులు జనగామలో రాజాను అరెస్ట్ చేశారు.



## జోరుగా ఇటుకబట్టీల దందా!

- అనుమతులు లేకుండా కొనసాగింపు
- విచ్చలవిడిగా నగరంలో సరఫరా
- పట్టింపులేని అధికార యంత్రాంగం

హైదరాబాద్, మార్చి 3: (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో అక్రమ ఇటుక బట్టీల దందా జోరుగా కొనసాగుతున్నది. ఇష్టారాజ్యంగా హైదరాబాద్‌కు ఇటుకలు తరలిస్తూ నిర్మాణదారుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. ఒక్కో లారీ లోడుపై రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు దండుకుంటున్నారు. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుంటే బట్టీల నిర్వాహకులు తాము 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అనే చందంగా వ్యవహరిస్తున్నారు. అక్రమ బట్టీలు, ఇటుక అక్రమ రవాణాపై ఎలాంటి పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడంతో కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు.

### గనులశాఖ అనుమతి తప్పనిసరి

నిబంధనల ప్రకారం ఇటుకబట్టీల ఏర్పాటుకు గనులశాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇటుకల తయారీకి కావాల్సిన మట్టి లభ్యతను బట్టి వారికి అనుమతులు మంజూరు చేస్తారు. మట్టి తవ్వకాలపై రాయల్టీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. అయితే, మన రాష్ట్రంలో జరుగుతున్నది మాత్రం ఇందుకు పూర్తి భిన్నం. ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు విచ్చలవిడిగా ఇటుకబట్టీలు నిర్వహిస్తున్నారు. స్థానిక చెరువులు, కుంటల్లో మట్టి తవ్వుతూ ఇటుకలు తయారు చేస్తున్నారు. నిత్యం హైదరాబాద్‌కు వందలాది లారీల్లో ఇటుకలను తరలిస్తున్నారు. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో అడ్డూఅదుపూ లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతూ బట్టీలు నిర్వహిస్తున్నారు. నిత్యం కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్నా గనులశాఖకు పట్టింపు లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని ఇటుకబట్టీలు నడుస్తున్నాయనే వివరాలు కూడా గనుల శాఖ వద్ద లేకపోవడం గమనార్హం.

### నాసిరకం ఇటుకతో మోసం

కొందరు దళారులు లారీ లోడులో లోపలంతా నాసిరకం ఇటుక పేర్చి, పైన ఒకటి రెండు వరుసలు మాత్రం నాణ్యమైన ఇటుకలు పెట్టి విక్రయిస్తున్నారు. తీరా లారీ అన్‌లోడ్ అయ్యాక కొనుగోలుదారులు ఇటుక మన్నికగా లేదని, నాసిరకంగా ఉందని లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇటుక అక్రమ దందా నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# తలలు పట్టుకుంటున్న ఏఈవోలు

- పథకాల అమలుపై ఏఈవోలను నిలదీస్తున్న అన్నదాతలు
- ప్రతీరోజు వందల ఫోన్‌కాల్స్.. సమాధానం చెప్పలేక సతమతం
- డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వేతోనూ తీవ్ర ఇబ్బందులు

హైదరాబాద్, మార్చి 3: (నమస్తే తెలంగాణ): ఎంకి పెండ్లి సుబ్బి చావుకొచ్చిందన్న చందంగా తయారైంది వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవో)ల పరిస్థితి. పథకాల అమలులో ప్రభుత్వ వైఫల్యం వీరికి శాపంగా మారుతున్నది. రుణమాఫీ, రైతుభరోసా అందకపోవడంతో రైతులంతా ఏఈవోలను నిలదీస్తున్నారు. తమకెందుకు రుణమాఫీ కాలేదని మాకెప్పుడు రైతుభరోసా వస్తుందని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ప్రతిరోజు సుమారు100 మంది రైతులు ఫోన్లు చేస్తున్నట్టు ఏఈవోలు వాపోతున్నారు. ఓవైపు ఇతర పనులు చేస్తూ.. మరోవైపు రైతుల ఫోన్లకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తీవ్రమైన పని ఒత్తిడి

కొద్దినెలలుగా ఏఈవోలపై పనిభారం అధికంగా పెరిగిపోయింది. వ్యవసాయ సంబంధిత అన్ని పనులకు ప్రభుత్వం వీరినే బాధ్యులు చేస్తుందని చెప్తున్నారు. రుణమాఫీకి సంబంధించిన సర్వేలన్నీ ఏఈవోలతోనే చేయించారు. గ్రీవెన్స్ కూడా వీరినుంచే తీసుకోవడం గమనార్హం. రైతుభరోసాకు భూముల సర్వేలోనూ ఏఈవోలను భాగస్వామ్యులను చేశారు. అలాగే కేంద్రప్రభుత్వం ఆదేశాలతో ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్)ను వీరితో చేయిస్తున్నది. ఇతర రాష్ట్రాల్లో డీసీఎస్‌ను ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు, ఇతర ప్రైవేటు వ్యక్తులతో చేయిస్తుంటే ఇక్కడ మాత్రం ఈ బాధ్యతలను ఏఈవోలకే అప్పగించారు. దీంతో ప్రతి సర్వే నెంబర్‌కు వెళ్లి ఫొటోలు తీయడం వీరికి తీవ్ర ఇబ్బందిగా మారింది.

### అన్నీ మాపై రుద్దితే..ఏ పనని చేయాలి?

ప్రభుత్వ, వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల తీరుపై ఏఈవోలు తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. అన్ని పనులు తమకే అప్పిగిస్తే.. ఏ పనని చేయమంటారని ప్రశ్నిస్తున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే కోసం ఫీల్డ్‌కి వెళ్లిన సమయంలో రైతులు ఆఫీసుకు వచ్చి ఫోన్లు చేస్తున్నారని, అందుబాటులో ఉండటం లేదని తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని పేర్కొంటున్నారు. రైతులతో నానా మాటలు పడాల్సివస్తుందని చెప్తున్నారు. ప్రభుత్వం పెడుతున్న కోతలకు రైతులు ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పలేకపోతున్నామని వాపోతున్నారు. తమపై పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.



## వద్దిరాజుతో సహచర ఎంపీల భేటీ

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను ఏపీ ఎంపీ బీద మస్తాన్‌రావు, ఒడిశా ఎంపీ సుభాశిశ్ కుంతియా మర్యాదపూర్వకంగా కలిశారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి హైదరాబాద్ వచ్చిన వీరిద్దరు రవిచంద్ర నివాసానికి వెళ్లారు. ఇంటికి వచ్చిన సహచర ఎంపీలను స్వాగతించిన రవిచంద్ర ఆతిథ్యమిచ్చి సత్కరించారు. వీరంతా కాసేపు పలు అంశాలపై చర్చించుకున్నారు.

## ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు ప్రారంభం

- నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- 10వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం

హైదరాబాద్, మార్చి 3(నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించింది. నామినేషన్ల విత్‌డ్రాకు 13 వరకు అవకాశం ఉంది. 20న ఎన్నికలు జరగనుండగా అదే రోజు ఫలితాలు కూడా వెల్లడికానున్నాయి. రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయి.

